# 70 ప్రాజెక్టులపై ఒప్పందాలు

## రూ. 35,861 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, జనవరి 10 (న్యూస్‌టుడే): రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి చారిత్రక మలుపు... రాష్ట్రానికి భారీ మొత్తంలో పెట్టుబడులను ఆహ్వానించడానికి ప్రభుత్వం చేసిన యత్నాలు సాకారమైన వేళ... అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న 'భాగస్వామ్య సదస్సు - 2001'ను వేదికగా చేసుకుని ఆంధ్రప్రదేశ్ తనకున్న అపార వనరులేమిటో విడమర్చి చెప్పింది. సదస్సు రెండో రోజైన బుధవారం నాడు హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ దర్బార్ హాలులో జాతీయ, అంతర్జాతీయ ప్రముఖుల సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం 35861.10 కోట్ల రూపాయల పెట్టుబడి విలువ గల 70 ప్రాజెక్టులకు సంబంధించి అవగాహన ఒప్పందాల (ఎం.ఒ.యు.)పై సంతకాలకు శ్రీకారం చుట్టింది. లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్.ఎన్.జి.) ప్రాజెక్టు ఎం.ఒ.యు.పై హైటెక్ పద్ధతిలో రాష్ట్రప్రభుత్వం తొలి సంతకాన్ని చేసింది. 19500 కోట్ల రూపాయల పెట్టుబడితో కాకినాడ సమీపంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, పెట్రోనాస్, కాకినాడ పోర్టు ప్రైవేట్ లిమిటెడ్ కన్సార్టియమ్ ఎల్.ఎన్.జి. టెర్మినల్‌ను నిర్మించనుంది. దీన్ని రెండు దశలలో పూర్తి చేస్తుంది. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ కార్యదర్శి పి. శంకర్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎం.ఎ. పఠాన్, డైరెక్టర్ పైప్‌లైన్ ఎ.కె. అరోరా, సుబీర్‌రాహా ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలోనూ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి కోటగిరి విద్యాధరరావు, రోడ్లు, భవనాల శాఖ మంత్రి విజయరామారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పి.వి.రావు, ఆర్ అండ్ బి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శులు రాంబాబు, టి.గోపాల్రావు, కాకినాడ పోర్టు ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ శ్రీనివాస్ హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలోను పాల్గొన్నారు. ఎల్.ఎన్.జి. టెర్మినల్ ఎం.ఒ.యు.పై సంతకాలు చేసే కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. టి.ఆర్ అండ్ బి. ప్రిన్సిపల్ సెక్రటరీ రాంబాబు, ఐ.ఒ.సి. ప్రతినిధి సుబీర్ సాహా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పి.వి.రావు, ఐ.ఒ.సి. ఛైర్మన్ ఎం.ఎ.పఠాన్ ఎం.ఒ.యు.పై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ దీన్ని చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. ఎల్.ఎన్.జి. టెర్మినల్ వల్ల రాష్ట్రానికి అపారమైన ప్రయోజనం కలుగుతుందన్నారు.







బుధవారం భాగస్వామ్య సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, ఐఒసికి మధ్య ఎం.ఒయు.: హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పి.వి.రావు సంతకం చేయగా, ఢిల్లీలో ఐ.ఒ.సి. అధికారులు పాల్గొన్నారు. ఈ సంతకాల కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు

పారిశ్రామికంగా మరింత ప్రగతికి ఇది తోడ్పడుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశిత ప్రణాళికలకు కట్టుబడి ఉంటుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని గడువు కంటే ముందే టెర్మినల్‌ను పూర్తి చేయాలని చెప్పారు. 48 నెలల్లో దీన్ని వినియోగంలోకి తేవాల్సి ఉందన్నారు. ఎల్.ఎన్.జి. పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సహకారాన్ని అందిస్తుందన్నారు. అనుమతుల జారీ, తదితర విషయాలను వెంటనే పరిశీలించి పరిష్కరించడానికి ఎస్కార్ట్ ఎగ్జిక్యూటివ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. భారీ పరిశ్రమల శాఖ మంత్రి కోటగిరి విద్యాధరరావు మాట్లాడుతూ నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషికి ప్రతిఫలంగానే ఇంత భారీ మొత్తంలో పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. పైప్‌లైన్ ప్రాజెక్టుల కింద 72000 కోట్ల రూపాయల పెట్టుబడులు కార్యరూపం దాల్చనున్నాయన్నారు. మరో 21339 కోట్ల రూపాయల పెట్టుబడులకు సంబంధించి ప్రాజెక్టులు నెలకొల్పడానికి ప్రభుత్వం ఆహ్వానిస్తోందన్నారు. తదనంతరం పర్యాటక రంగంలో 253.50 కోట్ల రూపాయల పెట్టుబడుల విలువ గల 19 ప్రాజెక్టులకు సంబంధించి (మిగతా 2వ పేజీలో)